క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధం


యూపీహెచ్‌సీ పనులు పరిశీలిస్తున్న ఏఈ వెంకట్

రాజాం: పట్టణంలోని ఆదర్శనగర్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏడాది కిందట ఎమ్మెల్యే కంబాల జోగులు ఈ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. సకాలంలో కాంట్రాక్టర్ పనులు పూర్తిచేసి భవనాన్ని అప్పగించడంతో మరో వారం రోజుల్లో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రూ.80 లక్షలతో భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు ఏఈ పి.వెంకట్ తెలిపారు.

జీవామృతంతో చీడపీడల నివారణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

రేగిడి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వినియోగించే జీవామృతంతో పంటలను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చని మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో చాటాయివలస గ్రామంలో రైతులకు జీవామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. పెద్దగా ఖర్చు లేకుండా స్థానికంగా లభించే పదార్థాలు, ఆకులు, ఆవుపేడ, మూత్రంతో ఘన, ద్రవ జీవామృతం తయారీ, పిచికారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు పైల తవిటినాయుడు, గుండాల రవి, పాదిలాపు సురేష్, కూడుబిల్లి రమణ, సింహాచలం, వీఏఏలు పాల్గొన్నారు.

భగవద్గీత పఠన పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు

బొబ్బిలి: గీతా జయంతి సందర్భంగాక హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఆదివారం పూల్‌భాగ్‌లోని డోలా మండపంలో విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. గీతలోని 15వ అధ్యాయమైన పురుషోత్తమ ప్రాప్తి యోగంలోని శ్లోకాలపై సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, గీతా మండపం అధ్యక్షుడు అల్లు స్వామినాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా రాము, కొల్లూరు జగన్నాథం, ముట్నూరు వేణుగోపాల్ వ్యవహరించారు. గణితోపాధ్యాయులు చింతల పైడిరాజు, పాపారావు, చెలికాని కేశవ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ భవనం ప్రారంభం



ఆయుష్మాన్ భారత్ భవనం

రేగిడి: మండలంలో సంకిలి గ్రామంలో ఉన్న ఆయుష్మాన్ భారత్ భవనం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఇటీవల ఈ భవనానికి రూ.4 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తికావడంతో పంచాయతీ సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, ఆయుష్మాన్ వైద్యాధికారి మోహనరావు ఆదివారం ఈ భవనాన్ని పునఃప్రారంభించారు. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించనున్నామన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి నిధులతో తోటలకు కందకాలు


నాయరాళ్లవలసలో పండ్ల తోటలో కందకాలను పరిశీలిస్తున్న ఏపీఓ

రేగిడి: రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలకు ఉపాధిహామీ పథకం ద్వారా కందకాలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని నాయరాళ్లవలస, లచ్చన్నవలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లోని రైతులు పండ్ల తోటలకు ఏర్పాటు చేస్తున్న కందకాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఉపాధిహామీ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కందకాలు ఏర్పాటు చేసుకోవడం వలన దిగుబడులు పెరుగుతాయన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు


క్రైస్తవులాంతా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ పండగ వచ్చేసింది. చర్చిలు విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబయ్యాయి. క్రిస్మస్ ట్రీస్, స్టార్స్, క్యాండిల్స్, శాంటాక్లాజ్, క్రిబ్(పశువుల పాక)లతో చర్చిలను అలంకరించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. క్రిస్మస్ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసకులు పాల్గోనున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


బొబ్బిలి: అందంగా అలంకరించిన బొబ్బిలిలోని ఆర్‌సీఎం చర్చి


వంగర: క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన కింజంగి చర్చి


రాజాం: విద్యుత్ వెలుగుల్లో పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో ఉన్న ఆర్‌సీఎం చర్చి


రాజాం: ఆర్‌సీఎం చర్చి ఆవరణలో క్రిస్మస్ ట్రీ


వంగర: వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు


రామభద్రపురం: మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి


బాడంగి: కోడూరుమాత చర్చిలో అందంగా అలంకరించిన క్రిబ్ వద్ద ఫాదర్ యుగల్‌కుమార్


రేగిడి: మండల కేంద్రంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


రాజాం: ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ ఏర్పాట్లు


రామభద్రపురం: క్రిస్మస్ సంబరాలలో చిన్నారులు


బాడంగి: విద్యుత్ కాంతులలో ఆర్‌సీఎం చర్చి

ప్రతి ఒక్కరూ తలెత్తుకునేలా ఉండాలి

- కొప్పుల వెలమ వనమహోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అందరూ ఐకమత్యంగా ఉంటూ తోటి వారికి సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని, సామాజికవర్గంలోని సభ్యులంతా తలెత్తుకునేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక రాణిగారి తోటలో కొప్పుల వెలమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ సామాజిక సేవలో తరించాలన్నారు. నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ.. అందరం ఐక్యంగా ఉంటూ సామాజిక వర్గాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ నార్త్‌కోస్ట్ సీఈ శంబంగి సుగుణాకరరావు, మాజీ జడ్పీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, కొప్పుల వెలమ సంఘం చైర్మన్ గొట్టాపు కృష్ణమూర్తి, కాపారపు శివున్నాయుడు, శంబంగి వేణుగోపాలనాయుడు, తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, బాడంగి జడ్పీటీసీ పెద్దింటి రామారావు, గంట అప్పలనాయుడు, డాక్టర్ ఆర్నిపల్లి గోపీనాథ్, జి.శశిభూషణరావు, గుల్ల రామ్‌నరేష్, కొప్పుల వెలమ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కర్రి సత్యనారాయణ, బలగ సాయికృష్ణ, కొప్పుల వెలమ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, తదితరులు

దానగుణం అలవర్చుకోవాలి

బొబ్బిలి: ప్రతి ఒక్కరూ దానగుణం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తెంటు శివప్పలనాయుడు మాతృమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి మేనత్త అయిన తెంటు రాములమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె సంస్మరణార్థం నిరుపేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బాడంగి జడ్పీటీసీ పెద్దింటి రామారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తేమ శాతం 14 కంటే తక్కువ ఉండాలి

రాజాం: రైతులు విక్రయానికి తీసుకొస్తున్న ధాన్యంలో తేమ శాతం 14 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. మండలంలో కంచరాం, ఆగూరు, బొద్దాం, నందబలగ తదితర గ్రామాల్లో రైతులు నూర్పిడిచేసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతం, ఆరబెట్టడం, కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యాన్ని పాడి సంచుల్లో వేసి, కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ చేస్తే రంగు మారుతుందని, రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి విక్రయాలకు సంబంధించి ట్రక్కు సీటు పొంది, సంబంధిత కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు.

రేగిడి: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని తేమ శాతం పరిశీలించి కొనుగోలు చేస్తున్నామన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో తేమ శాతం పరిశీలనకు యంత్రాలు వినియోగిస్తున్నామని, టెక్నికల్ అసిస్టెంట్లు రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతం ఎంత ఉందో లెక్కించి చెపుతారన్నారు.


రాజాం: బొద్దాంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రరావు


రేగిడి: ఉనుకూరు ఆర్‌బీకేలో ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం


వంజరాపు వెంకటవిజయ్‌కుమార్, గెడ్డాపు అప్పలనాయుడు, వేమిరెడ్డి సూర్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు, వావిలపల్లి రమణ

రాజాం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నూతన అధ్యక్షుల నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ప్రకటన చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపింది. పార్టీ రాజాం పట్టణ యువజన అధ్యక్షుడిగా ఈశ్వరనారాయణ కాలనీకి చెందిన వంజరాపు వెంకటవిజయ్‌కుమార్, రాజాం మండల యువజన అధ్యక్షుడిగా కంచరాం గ్రామానికి చెందిన గెడ్డాపు అప్పలనాయుడు నియమితులయ్యారు. వంగర మండల యువజన అధ్యక్షుడిగా కింజంగి గ్రామానికి చెందిన వేమిరెడ్డి సూర్యనారాయణ, రేగిడి మండల యువజన అధ్యక్షుడిగా సంకిలి గ్రామానికి చెందిన మజ్జి శ్రీనివాసరావు, సంతకవిటి మండల యువజన అధ్యక్షుడిగా కాకరాపల్లికి చెందిన వావిలపల్లి రమణ నియమితులయ్యారు. వారికి ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు.

సీఎం సహాయ నిధి అందజేత

రాజాం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వంగర మండలం కొప్పర కొత్తవలస గ్రామానికి చెందిన అరసాడ ఆదిలక్ష్మి అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరగా, కుటుంబ సభ్యులు వైద్య ఖర్చుల కోసం అప్పు చేయాల్సి వచ్చింది. ఆర్థిక ఇబ్బందులను తెలియజేస్తూ ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం రూ.1.60 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆదిలక్ష్మి భర్త పైడిరాజుకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వంగర మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు ఉన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఇలా ఉంటే.. రాకపోకలు ఎలా?

బాడంగి: మండలంలోని డొంకినవలస రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోయి ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారంతా ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ అండర్ బ్రిడ్జి ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోంది. గత పదిరోజులుగా నీరు నిలిచిపోయిందని, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. గతంలో ఇక్కడ నిలిచిపోయిన నీటిని కాంట్రాక్టర్ ఇంజిన్ సాయంతో బయటకు తోడేవారని, కానీ ప్రస్తుతం కాంట్రాక్టర్ కాలపరిమితి ముగియడంతో ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. దక్షిణ గేటు ద్వారా వెళ్లాలంటే ప్రతీ గంటకు గేటు పడటంలో నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. రైల్వేశాఖ అధికారులు స్పందించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


నీటితో నిండిన అండర్ పాస్

పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు


విద్యార్థినితో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చదవడం, చెప్పించడం చేయించారు. అనంతరం లైబ్రేరియన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో చదువంటే మాకిష్టం అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యార్థులంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హరేరామ సప్తాహం

సంతకవిటి: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న హరేరామ సప్తాహ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 23న ప్రారంభమైన ఈ సప్తాహ కార్యక్రమం ఏడు రోజుల పాటు కొనసాగనుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

బాడంగి: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ నెల 26 నుంచి జనవరి 5 వరకు గ్రామ సచివాలయ స్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీల నిర్వహణకు మండలంలో ఏడు మైదానాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. బాడంగి హైస్కూల్ మైదానంలో బాడంగి, ముగడ, తెంటువలస, పెదపల్లి గ్రామాలకు చెందిన యువతకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీఎస్‌ఆర్‌డబ్ల్యూఎస్ పాఠశాల ఆటస్థలంలో పిన్నవలస, డొంకినవలస, లక్ష్మీపురం గ్రామాల వారికి పోటీలు జరుగుతాయన్నారు. గొల్లాది, కామన్నవలస, గజరాయునివలస గ్రామాలవారికి గొల్లాది హైస్కూల్ మైదానంలో, కోడూరు-1, కోడూరు-2, వీరసాగరం, పిండ్రంగివలస సచివాలయాల పరిధిలోకి యువతకు కోడూరు హైస్కూల్ మైదానంలో పోటీలు జరగనున్నాయి. అలాగే పాల్తేరు, బొత్సవానివలస, భీమవరం, మల్లంపేటవారు క్రీడాకారులకు పాల్తేరు హైస్కూల్ గ్రౌండ్‌లో, రేజేరు, పినపెంకి, ఆనవరం, పీపీపేట, జీకేఆర్ పురం గ్రామాల వారికి రేజేరు హైస్కూల్ గ్రౌండ్‌లో, వాడాడ, గూడెపువలస, పూడివలస, కోటిపల్లి, ఆకులకట్ట గ్రామాలకు చెందిన క్రీడాకారులకు వాడాడ హైస్కూల్ మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


రాజాం సిటీ: టీంల ఏర్పాటుపై సచివాలయ అడ్మిన్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ నాగరాజు


రాజాం: పాగిరిలో 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ

టీంల ఏర్పాటు

రాజాం సిటీ: ఈ నెల 26 నుంచి సచివాలయాల పరిధిలో నిర్వహించే 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలకు సంబంధించి టీంలు ఏర్పాటు చేస్తున్నామని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం సచివాలయ అడ్మిన్ అసిస్టెంట్లతో కలిసి రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులతో టీమ్‌లను ఫాం చేశారు. క్రీడలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

పాగిరిలో ర్యాలీ

రాజాం: మండలంలో పాగిరి గ్రామంలో ఆదివారం 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 26 నుంచి జరిగే క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో పంచాయతీ సర్పంచ్ పాగిరి కృష్ణవేణి, పాగిరి లెనిన్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, గ్రామానికి చెందిన క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.